


రాజలక్ష్మి ప్రొడక్షన్స్

రక్తసంబంధం

దర్శకుడు · వి. మధుసూదన రావు



నిర్మాతలు
సుందర్‌లాల్ నహతా
డూండీ

ఈస్టిండియా రిలీజ్

నటీనటులు

★

ఎన్. టి. రామారావు	—	రాజశేఖర్
కాంతారావు	—	ఆనంద్
రేలంగి వెంకట్రామయ్య	—	అప్పారావు
రమణారెడ్డి	—	విశ్వనాధం
కె. వి. యస్. శర్మ	—	రత్నం
ప్రభాకరరెడ్డి	—	భాస్కర్
వై. బి. రాజు	—	సుబ్బన్న
సావిత్రి	—	రాధ
దేవిక	—	మాలతి
గిరిజ	—	సీత
సూర్యకాంతం	—	కాంతమ్మ

★ ★

P.V.L.R.

★ కథ ★

"అన్నయ్యా! ఇవాళ నీకిష్టమైన పూరీకూర చేశాను. ఒక్క ముక్క కూడా వదలకూడదు. తెలిసిందా?" అంటూ రాధమ్మ అన్న రాజశేఖర్‌కు టిఫిన్ కారియర్ అందించింది.

"అమ్మా; నువ్వింత రుచిగా చేశావంటే ఇంక టిఫిన్‌కాదు కారియర్ కూడా మిగలదు.జాగర్త" అన్నాడు రాజునవ్వుతూ.రాధ నవ్వింది.

"అమ్మా! రాధా! నన్నింత బుజ్జగించి ఎవరమ్మా తినిపిస్తారు? నాకు తల్లిలేనిలోటు తీరుస్తున్నావమ్మా!" అన్నాడు రాజు.

"నువ్వుమాత్రం నాకు అమ్మా నాన్నా ఇద్దరూలేని లోటు కనబడకుండా చూట్టంలా?" అంది రాధ. అంతలో ఫ్యాక్టరీ సైరన్ కూసింది. రాజు మిల్లుకు పరుగెత్తాడు.

రాజు తన పదోయేటినుంచీ చెల్లెల్ని అపురూపంగా పెంచుతూ వచ్చాడు. కూలీనాలీచేసి నాలుగు డబ్బులు తెచ్చి తాను పస్తులుండైనా చెల్లెలికి పెట్టేవాడు. అతని ఆశలూ, కలలూ అన్నీ రాధచుట్టూనే. చెల్లెలుకు గొప్పింటి సంబంధం చూచి చక్కని యువరాజుకిచ్చి పెళ్ళి చేయాలనీ. వాళ్ళిద్దరూ తనకళ్ళెదుటెకళకళలాడుతూతిరగ్గాచూడాలనీఅతనిఆశ.

రాధ ఒకనాడు వాళ్ళ ఆవును యింటికి తీసుకువస్తుంటే కారును చూచి అది బెదిరి కొమ్ము విసిరింది. రాధ కింద పడింది. ఆనంద్ అనే మిల్లుకార్మికుడు ఆమెకు కట్టుకట్టి యింటికి పంపాడు. ప్రాణసమానమైన తన చెల్లెలికి చూపిన ఈ ఆదరణకు రాజు హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది.

నాటినుంచి రాజూ ఆనందూ ప్రాణ స్నేహితులయారు. రాధా ఆనంద్‌ల పరిచయం పెరిగింది. వాళ్ళిద్దరూ మనసిచ్చిపుచ్చుకున్నారు.

అంతలో ఒకనాడు మిల్లులో సమ్మెజరిగింది. మిల్లు మూసేశారు. నౌకరీ పోయిందని బాధపడుతున్న రాజుకి రాధ ధైర్యం చెప్పింది. ఆమె యింతకాలం అన్నసంపాదనలో కొంతవెనకేసీ,పాలూ,మజ్జిగా అమ్మిఒక బొమ్మల కంపెనీలో బొమ్మలుతెచ్చి వాటికి రంగులువేసి: వెయ్యి రూపాయలు పోగేసి దాచింది. ఇప్పుడు అన్నను ప్రోత్సహించి ఆ పెట్టుబడితో ఒక బొమ్మల కంపెనీని పెట్టింది. వాళ్ళు కష్టపడి పనిచేసి కంపెనీని వృద్ధిలోకి తెచ్చారు. రాజు కొంత పెద్దమొత్తమును వెనకేశాడు. దాన్నేదైనా కొత్తవ్యాపారంలో పెట్టాలని తన పాతమిల్లు యజమాని

రత్నం గారిని సలహా అడిగాడు. ఆయన తాను మూసిన మిల్లును తీసుకుని నడపమనీ డబ్బు నెమ్మదిగా కట్టవచ్చునని చెప్పాడు. రాజుకు దశ ఎత్తుకుంది. కొద్దికాలంలోనే లక్షాధికారి అయినాడు. తన చిన్ననాటి కలలు నిజం కాబోతున్నాయని వుప్పొంగిపోయాడు. చెల్లెలకి గొప్పింటి సంబంధాలు చూడసాగాడు.

కోర్టు పనిమీద స్వగ్రామం వెళ్ళి చాలా కాలానికి తిరిగివచ్చిన ఆనంద్ తన మిత్రుడు యింత గొప్పవాడు అయ్యాడని ఆనందించాడు. రాజు అతన్ని ఆదరించి తన మిల్లులోనే వుద్యోగం యిచ్చాడు.

రాధా ఆనంద్‌ల ప్రణయం కొత్తచిగురు తొడిగింది. రాధ పుట్టిన రోజునాడు ఆనంద్ ఆమె తలలో పూలు తురుముతూ వుండగా రాజు చూచాడు. ఒళ్ళుపై తెలియని కోపంతో చెల్లెల్ని లోపలికి పంపి ఆనంద్ రక్తం కళ్ళచూచేదాకా కొట్టి పొమ్మన్నాడు. అక్కడితో ఆగక మిల్లులో అతని మిత్రులయిన వర్కర్లందరిని తీశేశాడు. తనమీద కోపం వర్కర్లమీద చూపడం అక్రమమంటూ ఆనంద్ రాజుతో ఘర్షణ పడ్డాడు. మిత్రులిద్దరూ శత్రువు లయిపోయారు. రాజు ఆ మర్నాడే చెల్లెలికి ఒక సంబంధం ఖాయపర్చాడు. పెండ్లికొడుకు పట్టుదలవల్ల అతని చెల్లెల్ని తను చేసుకునేందుకుకూడా ఒప్పుకున్నాడు. ముహూర్తం పెట్టి ఉత్సాహంగా యింటికి వచ్చిన రాజుకి తోటలో రాధా, ఆనంద్‌లు మాట్లాడు కుంటున్నారని తెలిసింది. ఆవేశంతో రివాల్వరు తీసుకొని ఆనంద్‌ను చంపెయ్యాలన్నంత కోపంతో తోటలోకి పరుగెత్తాడు. వాళ్ళ మాటలు విని కొంచెంఆగి ఒకచెట్టువెనుక దాగాడు. ఆనంద్ రాధను తనతో వచ్చెయ్యమంటాడు. రాధ అతన్ని సమాధానపరుస్తుంది. "మీఅన్నయ్య సమక్షంలో మనపెళ్ళి జరగాలంటే వాడొచ్చి నాకాళ్ళమీదపడి క్షమాపణ వేడుకోవాలి" అన్నాడు ఆనంద్. రాధ బ్రతిమాలినకొద్దీ రెచ్చిపోయి రాజును దూషించసాగాడు. రాధ ఆనంద్‌కు ఎదురు తిరిగింది. "మా అన్నయ్యమీద పగ సాధించటమే మన పెళ్ళికి లక్ష్యమైతే అదే నీ ప్రేమకు షరతైతే, నాకీపెళ్ళివద్దు ఆ ప్రేమావద్దు, సెలవు" అంటూ గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోయింది రాధ.

ఆనంద్‌ను రాజుఅవమానించినందుకు పగసాధిస్తానని ప్రతిజ్ఞపట్టినఆనంద్అత్తయ్య కాంతమ్మవాళ్ళజీవితాలను ఎలాఛిన్నాభిన్నంచేసింది? సత్యమయిన, శాశ్వతమయిన, సోదర, సోదరీప్రేమ, రక్తసంబంధం-ఈప్రచండశక్తులనుఎలాఎదిరించి జయించిందీ మీహృదయాలను కదలించివేయగలకరుణరసభరితమయిన యీచిత్రంలో చూడండి.

రక్త సంబంధం

★ పాటలు ★

1. నేపథ్య గీతం

రచన : దాశరధి　　　　పాడినవారు : ఘంటసాల

పల్లవి : ఇదే రక్తసంబంధం
హృదయాలను కలిపేదీ
కలకాలం నిలిచేదీ
నిజమైన జన్మబంధం

చరణం : చెల్లి సుఖమె తన సుఖమని యెంచును
చెల్లికొరకు గుండెలు కరగించును
తలి దండ్రిలేని లోపం　　తొలగించినాడు, పాపం
ఏనాటికైన గానీ　　విడిపోనీ దివ్యబంధం...　　॥ఇదే॥

చరణం : ఒకె గూటిలోని చిన్నిపిల్లలు, ఒకరి విడిచి
ఒకరు బ్రతుకనొల్లరు
దేహాలు వేరుగానీ　　హృదయాలు రెండు ఒకటే
సుడిగాలులెన్ని రానీ　　తెగిపోని మధుర బంధం........　　॥ఇదే॥

2. రాధ & రాజు నృత్యగీతం

రచన : కొసరాజు

పాడినవారు : ఘంటసాల, సుసీల & పార్టీ

మంచిరోజు వస్తుందీ
మాకు బ్రతుకు నిస్తుందీ
పదిమందిని పోషించే
దశ వస్తుందీ........　　॥మంచి॥
బ్రతుకు బాటలో
వెన్నెల కాయక పోదూ
మధురమైన మా కోరిక తీరకపోదూ

ఐశ్వర్యము చిగురింప—ఆనందము పులకింప
సౌఖ్యముగా-జీవితమూ-సాగకపోదూ ॥మంచి॥
చిన్న చిన్న పరిశ్రమల స్థాపించెదమూ
ఒకరికొకరు దీసిపోక—ఉత్సాహం జారనీక
దీక్షగ నవభారతమును సృష్టించెదము ॥మంచి॥
స్వార్థ బుద్ధి గలవారికి—అభివృద్ధే వుండదూ
మంచి మనసు గలవారికి—వంచన లేదూ—ఓటమి రాదూ!




3. రాధ & ఆనంద్
యుగళగీతం

పాడినవారు :
పి. బి. శ్రీనివాస్ & సుశీల

రచన :
సి. నారాయణరెడ్డి

ఆనంద్ : ఎవరో నను కవ్వించి పోయే రెవరో
రాధ : ఎవరోకానీ విరిసీ విరియని పువ్వులవంటి
నామది నవ్వించి పోయే రెవరో ॥ఎవరో॥
ఆనంద్ : చూపుల సంకెలవేసి—నా
జూకుగ బందీ జేసి
రాధ : కల్లా కపటం ఎరుగని కన్నెను
కలవరపరచిన కథానాయకుడు ॥ఎవరో॥
రాధ : పదములు ముందుకు సాగ
నా హృదయము వెన్కకు లాగ
ఆనంద్ : చెంగట నిలిచీ చేతికి అందక
చిలిపిగ నవ్వే చలాకి చిన్నది ॥ఎవరో॥
ఆనంద్ : చల్లని సంధ్యావేళ-నా వుల్లము ఝల్లను లీల
రాధ : దోసెడు మల్లెలతో ఎదురై
మధుమాసములో నను మంత్రించి వేసే దెవరో ॥ఎవరో॥
రాధ & ఆనంద్: హో హా హో హా హా హో—హో హా హో హో హో
హో హా హో హో హా హో—హో హో హో హో హో ………

4. నృత్యగీతం :



పాడినవారు :
జానకి & పార్టీ

రచన :
సి. నారాయణరెడ్డి

సాకి : ఆకాశమేలే అందాల రాజే
నాకెదురై నాడే

పల్లవి: నన్నే చూచీ నవ్వులు దాచీ
కన్నులు కలిపాడే! ||ఆకాశ||

చరణం : నారాజు తానే నను చూడగానే
లోలోన మురిసితినే
ఆకళ్ళలో అందాలు సోకి
లోకం మరచితినే
దొరలా మెలగీ తరుణీ హృదయం
దోచిన మొనగాడే!

అందరు : ముంగిట నిలచిన మోహనరూపుని
ముందుకు పోవేమే, చెలి
వెన్నెల వేళల కమ్మని వలపుల
విందు చేయవేమే

చరణం ; నా వన్నెకాని నయనాలలోని
భావం తెలిసినదే
నా గొంతులోనే-ఏనాడులేని
రాగం తెలిసినదే
కలగా కదిలే కమ్మని తలపే
నిజమై నిలచినదే

అందరు : ముంగిట నిలచిన మోహనరూపుని....

5. నృత్య గీతం

రచన : ఆరుద్ర   పాడినవారు:సుశీల & పార్టీ

బంగారు బొమ్మ రావేమే
పందిట్లొ పెండ్లి జరిగేనే
కళ్యాణ శోభ కనగానే
కనులార తనవి తీరేనే ॥బంగారు॥

ఎనలేని నోము నోచీ-నీ
వీరోజు కెదురు చూచీ
మురిపించి మనసుదోచీ మది
ముత్యాల ముగ్గువేసీ
కలగన్న ఘడీయ రాగానే
తలవంచి బిడియపడరాదే ॥బంగారు॥

అందాల హంస నడకా - ఈ
అమ్మాయి పెండ్లి నడక
ఓ యమ్మ సిగ్గుపడకే వేచి
యున్నాడు పెండ్లి కొడుకే
నూరేళ్ళ పంట పండేనే
గారాల సిరులు పెరిగేనే ॥బంగారు॥

మనసైనవాడు వరుడు నీమది నేలుకొనెడు ఘనుడు
వేసేను మూడుముళ్ళు - ఇక కురిసేను పూల జల్లు
ఈ ఏటికిరువు రొకపైతే·మీదటికి ముగ్గురౌతారే ॥బంగారు॥



6. రాధ పాట

పాడినవారు : సుశీల

రచన : ఆరుద్ర



ఒహో వయ్యారి వదినా వులుకెందుకే - నీ
వగలన్నీ ఒకేసారి చూపకే!
అహ, వుప్పొంగే ఉబలాటం దాచవే - ఇది
ఒక నాటితో అయ్యేది కాదులే-
నిజమే తొలిరేయి భావాలూ
నిలుపాలేనట్టి మోహాలూ
అయినా ఒక్కింతా ఆగాలీ-ఆగాలీ
అనువైన నునుసిగ్గూ జవరాలూ చూపాలీ
ఎంత సాహసివైనా ఇంత తొందర పడితే
హవ్వ! నలుగురిలో నగుబాట్లు తప్పవే-నీ
వలపెంతో గొప్పదనీ చాటకే! ॥ఒహో॥

మరల రాదంటూ ఈరోజు
మదిలో శ్రుతి మించెనే నీ జోరూ
అసలే అన్నయ్యది వెన్నలాంటి మనసూ
అలాగనీ గడుసుదేరి చేయకమ్మ అలుసు
తాను చెంతకు చేరీ-మేను తాకిన చాలూ
నీ గడుసుదనం గాలి కెగిరిపోవునే
నేడే-నీ పడుచుదనం పరవశించి పండునే ॥ఒహో॥

7. రాధ & రాజు యుగళగీతం

రచన : అనిసెట్టి


పాడినవారు: ఘంటసాల & సుశీల

రాధ : చందురునీ మించు అంద మొలికించు
ముద్దు పాపాయివే....
నిను గన్నవారింట
కష్టముల నీడ, కరగిపోయేనులే॥
కరుణతో జూచి
కనక దుర్గమ్మ
కామితము లిచ్చులే
లోకములనేలు వెంకటేశ్వరుడు
నిన్ను దీవించులే........

రాజు : చందురుని మించు అంద మొలికించు........

రాధ : అన్న వడిజేర్చి ఆటలాడించు
నాటి కధ పాడనా - అనాటి కధ పాడనా -
కలతల కులొంగి కష్టముల క్రుంగు
నేటి కధ పాడనా - కన్నీటి కధ పాడనా

రాజు : కంటిలో పాప, ఇంటికే జ్యోతి
చెల్లి నా ప్రాణమే
మము విధియె విడదీసె, వెతలలో త్రోసె
మిగిలె నీ శోకమే...
చందురుని మించు



రాధ : మనసులను కలుపు మధుర బంధాలు
మాసిపోరాదులే
పెరిగి నీవైన
మామగారింటి
మనుమునే కోరుమా
రాజు : కాలమెదురైన గతులువేరైన
మమతలే మాయునా
పెరిగి నీవైన చెల్లి సుతనైన
పరిణయమ్మాడరా
మా బంధమే నిల్పరా!
దివిలో తారకలు
భువిలో మానవులు
ధూళిలో కలసినా
అన్నచెల్లెళ్ల జన్మబంధాలు
నిత్యమై నిల్చులే.

8. నేపథ్యగీతం

పాడినవారు : ఘంటసాల   రచన : అనిసెట్టి

అల్లారుముద్దుగా అన్నయ్య పెంచిన
చెల్లాయి అతనితో జీవిత చాలించె
ఒకటిగా జన్మించి ఒక్కరుగా జీవించి
ఒకటిగానే వారు ఒరిగిపోయారు
అన్నచెల్లెళ్ళ ఆత్మలే అవనిలో
సూర్య చంద్రులుగా వెలుగొందులే
సుఖశాంతులే భువిని వెలయించులే
ఇదే రక్త సంబంధం
హృదయాలను కలిపేది
కలకాలం నిలిచేది
నిజమైన జన్మబంధం
ఇదే - రక్తసంబంధం

★

సాంకేతిక నిపుణులు

మాటలు :	ముళ్లపూడి వెంకటరమణ
పాటలు :	సి. నారాయణరెడ్డి, ఆరుద్ర, దాశరథి, అనిసెట్టి, కొసరాజు
కెమేరా:	సి. నాగేశ్వరరావు
సంగీతం :	ఘంటసాల
కళ :	కృష్ణారావు
శబ్దదర్శకుడు :	మోహన సుందరం
అసోసియేట్ డైరెక్టర్ :	యం. మల్లిఖార్జునరావు
అసిస్టెంటు డైరెక్టరు :	కె. ఎ. చార్య
ఎడిటింగ్ :	ప్రకాశం
దుస్తులు :	వి. ఎస్. గాంధి
స్టూడియో :	గోల్డెన్, విజయా

దర్శకుడు :

వి. మధుసూదనరావు

నిర్మాతలు :

సుందర్‌లాల్ నహతా
డూండీ

★

శ్రీ పద్మనాభ. విజయవాడ-3.